
సాక్షి
డా. బి ఆర్ అంబేడ్కర్ కోనసీమ
సోమవారం । 18 । మార్చి । 2024



రూ.1,11,116 విరాళం

అన్నవరం: సత్యదేవుని నిత్యాన్నదాన పథకానికి డీసీసీబీ చైర్మన్ ఆకుల వీర్రాజు, నాగమణి దంపతులు (రాజమహేంద్రవరం) ఆదివారం రూ.1,11,116 విరాళం సమర్పించారు.



డెల్టాలకు నీటి విడుదల

ధవళేశ్వరం: కాటన్ బ్యారేజీ నుంచి ఆదివారం గోదావరి తూర్పు డెల్టాకు 2,650, మధ్య డెల్టాకు 1,720, పశ్చిమ డెల్టాకు 4,600 క్యూసెక్కుల చొప్పున నీటిని విడుదల చేశారు.



న్యూస్‌రీల్

సీఎం జగన్ రావులపాలెం సభ వాయిదా

కొత్తపేట: రావులపాలెంలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాల్గొనే బహిరంగ సభ వాయిదా పడింది. అసెంబ్లీ, పార్లమెంట్ ఎన్నికల షెడ్యూల్ విడుదలైన నేపథ్యంలో ఎన్నికల ప్రచారంలో భాగంగా కోనసీమ ముఖద్వారమైన రావులపాలెంలో మంగళవారం సీఎం జగన్ బహిరంగ సభ జరగాల్సి ఉంది. అయితే సీఎం కార్యక్రమాల షెడ్యూల్‌లో మార్పుల కారణంగా ఈ సభ వాయిదా పడిందని కొత్తపేట ఎమ్మెల్యే, స్థానిక వైఎస్సార్ సీపీ అభ్యర్థి చిర్ల జగ్గిరెడ్డి తెలిపారు. త్వరలోనే సీఎం జగన్ రావులపాలెం సభ షెడ్యూల్ ప్రకటిస్తామని చెప్పారు.

అయినవిల్లికి పోటెత్తిన భక్తులు



విఘ్నేశ్వరుని దర్శించుకుంటున్న భక్తులు

అయినవిల్లి: విఘ్నేశ్వరస్వామి ఆలయం ఆదివారం భక్తులతో కిక్కిరిసింది. స్వామిని అధిక సంఖ్యలో భక్తులు దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ ప్రధానార్చకుడు అయినవిల్లి సూర్యనారాయణమూర్తి ఆధ్వర్యంలో స్వామికి మేలుకొలుపు సేవతో పాటు వివిధ పూజలు నిర్వహించారు. అనంతరం పుష్పాలతో సర్వాంగ సుందరంగా అలంకరించారు. స్వామివారి లఘున్యాస అభిషేకాలు, లక్ష్మీగణపతి హోమంలో అధిక సంఖ్యలో భక్త దంపతులు పాల్గొన్నారు. ప్రత్యేక అభిషేకాల్లో 47 మంది, ప్రత్యేక దర్శనంలో 470 మంది, లక్ష్మీ గణపతి హోమంలో 15 మంది పాల్గొని పూజలు నిర్వహించారు. 18 మంది నూతన వాహన పూజలు, 8 చిన్నారులకు నామకరణాలు, అక్షరాభ్యాసాలు జరిపారు. తొమ్మిది మంది భక్తులు స్వామికి తలనీలాలు సమర్పించారు. స్వామి వారికి వివిధ పూజలు, అన్నదాన విరాళాలుగా రూ.1,79,800 ఆదాయం లభించిందని ఆలయ చైర్మన్ గుత్తుల నాగబాబు, దేవదాయ శాఖ అసిస్టెంట్ కమిషనర్ ముదునూరి సత్యనారాయణరాజు తెలిపారు.

శాస్త్రీయ దృక్పథంతోనే సమాజాభివృద్ధి

జేవీవీ రాష్ట్ర గౌరవాధ్యక్షుడు స్టాలిన్

అమలాపురం టౌన్: శాస్త్రీయ దృక్పథమే సమాజాభివృద్ధికి మూలమని జన విజ్ఞాన వేదిక (జేవీవీ) రాష్ట్ర గౌరవాధ్యక్షుడు డాక్టర్ సి.స్టాలిన్ అన్నారు. ఈ కోణంలోనే విద్యార్థులకు శాస్త్రీయ దృక్పథాన్ని బోధించే దిశగా సమాజాభివృద్ధికి బాటలు వేయాలని ఆయన పిలుపునిచ్చారు. అమలాపురం గోఖలే సెంటరులోని జేవీవీ జిల్లా కార్యాలయంలో ఆదివారం జరిగిన జేవీవీ జిల్లా కార్యదర్శివర్గ సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడుతూ కవులు గురజాడ, వేమన, కందుకూరి వీరేశలింగం, డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ రచనల్లో శాస్త్రీయ దృక్పథంతో హితబోధ చేశారన్నారు. జేవీవీ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ ఈఆర్ సుబ్రహ్మణ్యం అధ్యక్షతన జరిగిన ఈ సమావేశం గ్రామ స్థాయిలో కూడా జేవీవీ మండల శాఖల ద్వారా శాస్త్రీయ దృక్పథం ప్రచారానికి శిక్షణ ఇవ్వాలని నిర్ణయించారు. జేవీవీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు కేవీవీ సత్యనారాయణ మాట్లాడుతూ ఈ నెల 22వ తేదీన ప్రపంచ జల దినోత్సవం సందర్భంగా పది రోజుల పాటు రాష్ట్ర వ్యాప్తంగా ఉత్సవాలు జరుగుతాయని వెల్లడించారు. తొలుత జేవీవీ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎండీ ఖాజా మొహిద్దీన్ గత కార్యక్రమాల సమీక్ష, భవిష్యత్ కార్యక్రమాల గురించి నివేదిక చదివారు. వేసవి వినోదం కార్యక్రమాలు జిల్లా వ్యాప్తంగా నిర్వహిస్తామని ఆయన వివరించారు. సమావేశంలో జిల్లా ఉపాధ్యక్షుడు జనుపల్లి సత్యనారాయణ, జిల్లా అకడమిక్, చెకుముకి కన్వీనర్ పీవీవీ ప్రసాద్, జేవీవీ ప్రతినిధులు కోలా వెంకటేశ్వరరావు, జి.ఈశ్వరరావు, నాగమణి తదితరులు పాల్గొన్నారు.

హరి మనో వికాస కేంద్రం డైరెక్టర్ అశోక్ కుమార్ మృతి



అమలాపురం రూరల్: ఈదరపల్లిలోని హరి మనో వికాస కేంద్రం మానసిక వికలాంగుల ప్రత్యేక పాఠశాల డైరెక్టర్ సల్లాబత్తుల అశోక్ కుమార్ (53) ఆదివారం అనారోగ్యంతో మృతి చెందారు. కొంత కాలంగా చికిత్స పొందుతున్న ఆయన నివాసంలో మృతిచెందారు. 26 ఏళ్ల క్రితమే బీఈ పూర్తి చేసి హైదరాబాద్‌లో ఓ సంస్థను స్థాపించారు. తన ఇంటి పక్కన నివాసముంటున్న ఓ కుటుంబంలో బాలుడు మానసిక వికలాంగుడు. అతన్ని సాకేందుకు తల్లిదండ్రులు పడుతున్న ఇబ్బందులను కళ్లారా చూసి చలించిపోయారు. మానసిక వికలాంగులకు కోనసీమలో సరైన పాఠశాల లేకపోవడంతో 1996లో ఈదరపల్లిలో హరిమనోవికాస కేంద్రాన్ని స్థాపించి వారి సేవలో తరించారు. ఆయన మృతితో పాఠశాలలో విద్యార్థులు, ఉపాధ్యాయులు కన్నీరు మున్నీరుగా విలపించారు. ఆయన సేవలను గుర్తించిన పలు సంస్థలు ఆయనకు అవార్డులు అందించాయి. ఆయన మృతికి పలువురి సంతాపం తెలిపారు.

అటెన్షన్.. ఆల్ ది బెస్ట్..

- నేటి నుంచి పదో తరగతి పరీక్షలు
- ఉదయం 9.30 నుంచి మధ్యాహ్నం 12.45 గంటల వరకు నిర్వహణ
- విద్యార్థులకు ఆర్టీసీ బస్సుల్లో అనుమతి

రాయవరం: పదో తరగతి వార్షిక పరీక్షలు సోమవారం ప్రారంభం కానున్నాయి. ఈ నెల 30వ తేదీ వరకు ఈ పరీక్షలు నిర్వహించనున్నారు. ప్రధానమైన పరీక్షలు 28వ తేదీతో ముగియనున్నాయి. ఇందుకు జిల్లా విద్యాశాఖ అన్ని ఏర్పాట్లు చేసింది. ఈసారి ఆరు సబ్జెక్టులకు ఏడు పేపర్లు నిర్వహిస్తున్నారు. గతంలో ప్రతి పరీక్ష మధ్య ఒక రోజు విరామం ఇవ్వగా, ఈ సారి వరుసగా సాగిపోనున్నాయి. ఎక్కడా పేపరు లీకేజీ జరగకుండా అధికారులు పకడ్బందీగా ఏర్పాట్లు చేయడంతో పాటు పరీక్షా కేంద్రాల వద్ద 144 సెక్షన్‌ను అమలు చేస్తున్నారు. ఇప్పటికే ఆయా పరీక్షా కేంద్రాల్లో హాల్ టికెట్ నంబర్లు కూడా బెంచీలపై వేశారు. కాగా ఆదివారం పలు పరీక్షా కేంద్రాలను డీఈవో ఎం.కమలకుమారి, ప్రభుత్వ పరీక్షల విభాగం అసిస్టెంట్ కమిషనర్ నక్కా సురేష్ సందర్శించి, వసతులను పరిశీలించారు.

112 పరీక్షా కేంద్రాల ఏర్పాటు

డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా వ్యాప్తంగా 112 పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేశారు. ఈ పరీక్షా కేంద్రాల్లో రెగ్యులర్ విద్యార్థులు 18,992 మంది , ప్రైవేట్‌గా 2,121 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరు కానున్నారు. వీరిలో 9,567 మంది బాలురు, 9,425 మంది బాలికలు పరీక్షలకు హాజరుకానున్నారు. ప్రైవేట్‌గా 1,304 మంది బాలురు, 817 మంది బాలికలు పరీక్షలు రాయనున్నారు. పరీక్షలు ఉదయం 9.30 నుంచి మధ్యాహ్నం 12.45 వరకు జరగనున్నాయి. ఫిజికల్ సైన్స్, బయోలాజికల్ సైన్స్ పరీక్ష మాత్రం ఉదయం 9.30 గంటల నుంచి మధ్యాహ్నం 11.30 గంటల వరకు కొనసాగుతాయి. విద్యార్థులు 9 గంటల కల్లా పరీక్షా కేంద్రాలకు చేరుకోవాలని అధికారులు సూచిస్తున్నారు. ఇప్పటికే జిల్లా కేంద్రానికి చేరుకున్న పరీక్షా పత్రాలను ఆయా పోలీసు స్టేషన్లలో భద్రపర్చారు.

నో మొబైల్ జోన్లుగా పరీక్షా కేంద్రాలు

మాస్ కాపీయింగ్‌కు అవకాశం లేకుండా ప్రతి పరీక్ష పేపరుపై క్యూఆర్ కోడ్, పరీక్ష పేపరుపై ఏడు అంకెల సిరీస్‌తో నంబర్‌ను ముద్రించారు. దీని వల్ల ఏ పరీక్షా కేంద్రంలో, ఏ ఇన్విజిలేటర్ ద్వారా, ఏ విద్యార్థి ప్రశ్నపత్రం బయటకు వెళ్లినా విషయం నిమిషాల వ్యవధిలో అధికారులకు తెలుస్తుంది. ఈ ఏడాది ప్రవేశ పెట్టిన నూతన విధానం మాస్ కాపీయింగ్ నిరోధానికి ఉపకరిస్తుందనడంలో ఏ మాత్రం సందేహం లేదు. పది పరీక్షా కేంద్రాలను నో మొబైల్ జోన్స్‌గా ప్రకటించారు. పరీక్షా కేంద్రంలోకి సీఎస్, డీవోలు, ఇన్విజిలేటర్లు, విద్యార్థులు సెల్‌ఫోన్ తీసుకువెళ్లడానికి అనుమతి లేదు. వీరంతా పరీక్షా కేంద్రం వద్ద బందోబస్తు నిర్వహించే పోలీసుల వద్ద సెల్‌ఫోన్లను డిపాజిట్ చేయాలి. అత్యవసరమైతే సీఎస్ పోలీసుల సమక్షంలోనే పై అధికారులతో ఫోన్ మాట్లాడి, తిరిగి మొబైల్ అక్కడే డిపాజిట్ చేయాలి. పరీక్ష సమయంలో ఆయా కేంద్రాల సమీపంలోని జెరాక్స్ సెంటర్లను మూసివేయాలి. ఎలక్ట్రానిక్ వస్తువులను వెంట తీసుకురావద్దని అధికారులు ఆదేశాలు జారీ చేశారు. ప్రతి ఒక్కరూ విధిగా ప్రభుత్వ గుర్తింపు కార్డును దగ్గర ఉంచుకోవాలి. మాస్ కాపీయింగ్ జరగకుండా ఉండేందుకు జిల్లా వ్యాప్తంగా ఐదు ఫ్లయింగ్ స్క్వాడ్లు ఏర్పాటు చేశారు. పరీక్షా కేంద్రానికి 100 మీటర్ల దూరంలో ఎవరూ ఉండకూడదు. విద్యార్థులు ఆయా పాఠశాలల యూనిఫాం కాకుండా సివిల్ డ్రెస్ ధరించి మాత్రమే పరీక్షా కేంద్రానికి హాజరు కావాల్సి ఉంటుంది.



పరీక్షలకు మేము కూడా 'సిద్ధం' అంటున్న విద్యార్థులు

నేటి నుంచే 'ఓపెన్'కూ..

- ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 75 పరీక్షా కేంద్రాలు
- హాజరు కానున్న 22,260 మంది విద్యార్థులు

రాయవరం: పదో తరగతి రెగ్యులర్ పరీక్షలతో పాటుగా, ఏపీ సార్వత్రిక విద్యాపీఠం ద్వారా పదో తరగతి, ఇంటర్ పరీక్షలు సోమవారం ప్రారంభం కానున్నాయి. మధ్యాహ్నం రెండున్నర గంటల నుంచి సాయంత్రం ఐదున్నర గంటల వరకు ఓపెన్ స్కూల్ పది, ఇంటర్ విద్యార్థులకు పరీక్షలు నిర్వహిస్తున్నారు. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ఓపెన్ పదో తరగతి పరీక్షలకు ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 22 పరీక్షా కేంద్రాలు ఏర్పాటు చేయగా 5,994 మంది, ఇంటర్ పరీక్షలకు 53 పరీక్షా కేంద్రాలు ఏర్పాటు చేశారు. 16,266 మంది పరీక్షలు రాయనున్నారు. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లాలో ఎస్ఎస్‌సీ 1,312, ఇంటర్ 5,263 కాకినాడ జిల్లాలో పది పరీక్షలు 2,067, ఇంటర్ 6,494, తూర్పుగోదావరి జిల్లాలో పదో తరగతి 2,615, ఇంటర్ 4,509 మంది పరీక్షలు రాయనున్నారు. పరీక్షల నిర్వహణలో భాగంగా కాకినాడ జిల్లాలో పదో తరగతికి 123, ఇంటర్‌కు 364, కోనసీమ జిల్లాలో పదో తరగతికి 74, ఇంటర్‌కు 290, తూర్పుగోదావరి జిల్లాలో పదో తరగతికి 128, ఇంటర్‌కు 242 మంది ఇన్విజిలేటర్లతో పాటు మూడు జిల్లాల్లో 15 ఫ్లయింగ్ స్క్వాడ్లను నియమించారు. పరీక్షల్లో విద్యార్థులకు ఎటువంటి సమస్యలు తలెత్తినా పరిష్కారానికి 9989800165 హెల్ప్‌లైన్ నంబరును ఏర్పాటు చేశారు.

హెల్ప్ డెస్క్ ఏర్పాటు

విద్యార్థుల సందేహాల నివృత్తికి విద్యాశాఖ ఆధ్వర్యంలో జిల్లా విద్యాశాఖ కార్యాలయంలో హెల్ప్ డెస్క్ ఏర్పాటు చేశారు. ఏమైనా ఇబ్బందులు ఉంటే కంట్రోల్ రూమ్ వద్ద ఉన్న 9493819102 నంబరను సంప్రదించాలని అధికారులు సూచిస్తున్నారు.

ఇబ్బందులు లేకుండా

విద్యార్థులకు ఇబ్బందులు కలగకుండా ఆయా పరీక్షా కేంద్రాల్లో తాగునీరు, వైద్యం, విద్యుత్ సౌకర్యంతో పాటు ఫర్నిచర్ ఏర్పాటు చేశారు. విద్యార్థులు ఎక్కడా నేలపై కూర్చుని పరీక్షలు రాయకుండా అవసరమైన అన్ని చర్యలు తీసుకున్నారు.

పరీక్షా కేంద్రాలు	112
మొత్తం విద్యార్థులు	21,113
రెగ్యులర్ విద్యార్థులు	18,992
ప్రైవేట్ విద్యార్థులు	2,121
మొత్తం బాలురు	10,871
మొత్తం బాలికలు	10,242
చీఫ్ సూపరింటెండెంట్లు	112
డిపార్ట్‌మెంటల్ అధికారులు	112
ఇన్విజిలేటర్లు	1,245
కస్టోడియన్ కమ్ సిట్టింగ్ స్క్వాడ్	35
ఫ్లయింగ్ స్క్వాడ్	05



పరీక్షా కేంద్రంలో ఏర్పాట్లను పర్యవేక్షిస్తున్న డీఈవో కమలకుమారి, ఏసీ సురేష్ తదితరులు

పక్కాగా ఏర్పాట్లు



పరీక్షలు పకడ్బందీగా నిర్వహించేందుకు పరీక్షా కేంద్రాల్లో పక్కాగా ఏర్పాట్లు చేశాం. సీఎస్, డీవో, ఇన్విజిలేటర్లు, కస్టోడియన్ల నియామకాలు పూర్తి చేశాం. పరీక్షా కేంద్రాల్లో ఏవైనా ఇబ్బందులు తలెత్తితే విద్యార్థులు, తల్లిదండ్రులు హెల్ప్ డెస్క్‌ను సంప్రదించాలి. పరీక్షలు ప్రశాంతంగా నిర్వహించేందుకు విద్యార్థులు, తల్లిదండ్రులు, ప్రజలు సహకరించాలి.

– నక్కా సురేష్, ఏసీ, ప్రభుత్వ పరీక్షల విభాగం, అమలాపురం

భయాందోళన వద్దు



తొలి రోజు విద్యార్థులు పరీక్షా కేంద్రానికి గంట ముందుగా చేరుకోవాలి. అన్ని సెంటర్లలో మౌలిక సదుపాయాలు ఏర్పాటు చేశాం. విద్యార్థులు ఎలాంటి భయాందోళనలకు గురికాకుండా, ప్రశాంతంగా పరీక్షలు రాయాలి. మాస్ కాపీయింగ్‌పై ఆధారపడొద్దు. పరీక్షా కేంద్రానికి దూర ప్రాంతాల నుంచి వచ్చే విద్యార్థులు హాల్ టికెట్ చూపించి ఆర్టీసీ బస్సుల్లో ఉచితంగా ప్రయాణించవచ్చు.

– ఎం.కమలకుమారి, డీఈవో, అమలాపురం

ఒత్తిడికి లోను కావద్దు



విద్యార్థులు ఏడాదంతా కష్టపడి చదివిన విషయాన్ని మూడు గంటల్లో ఎటువంటి ఒత్తిడికి లోను కాకుండా రాయాలి. పరీక్ష పత్రాన్ని 15 నిమిషాల ముందే ఇస్తున్నందున ప్రశ్నలను మొదట క్షుణ్ణంగా చదవాలి. విద్యార్థులు మొదటి పరీక్ష నుంచి చివరి పరీక్ష వరకు ప్రతి పేపరును సీరియస్‌గా తీసుకోవాలి. పరీక్షా కేంద్రానికి భద్రంగా చేరుకోవాలి. ఆందోళనకు గురికాకుండా ప్రశాంతంగా పరీక్షలు రాయాలి.

– జి.నాగమణి, రీజినల్ జాయింట్ డైరెక్టర్, పాఠశాల విద్యాశాఖ, కాకినాడ

వైఎస్సార్ సీపీదే మళ్లీ అధికారం



విప్పర్తి సమక్షంలో వైఎస్సార్ సీపీలో చేరిన జనసేన కార్యకర్తలు

- పార్టీ పి.గన్నవరం ఇన్‌చార్జి విప్పర్తి
- 100 మంది జనసేన కార్యకర్తల చేరిక

పి.గన్నవరం: వైఎస్సార్ సీపీ మళ్లీ అధికారంలోకి వచ్చి జగన్‌మోహన్ రెడ్డి రెండో సారి ముఖ్యమంత్రి కావడం ఖాయమని పి.గన్నవరం నియోజకవర్గ పార్టీ ఇన్‌చార్జి, జెడ్పీ చైర్మన్ విప్పర్తి వేణుగోపాలరావు అన్నారు. మండలంలోని పప్పులవారిపాలెంలో వైఎస్సార్ సీపీ నాయకులు పప్పుల రాంబాబు, పప్పుల కర్ణ, పినిశెట్టి శ్రీనివాస్ ఆధ్వర్యంలో ఆదివారం 100 మంది జనసేన కార్యకర్తలు వైఎస్సార్ సీపీలో చేరారు. పార్టీలో చేరిన పినిశెట్టి సత్యనారాయణ, పప్పుల పెదవెర్రియ్య, బండారు వెంకటేశ్వరరావు, మంచిగంటి ఏసుబాబు, అంద్రోతు హనుమంతరావు, కడలి ప్రకాశం, కాసర సత్తిపండు, ఏడుకొండలు తదితరులకు విప్పర్తి కండువాలు వేశారు. పార్టీ నాయకులు అడ్డగళ్ల వెంకట సాయిరామ్, మెల్లం మహాలక్ష్మి ప్రసాద్, కొక్కిరి రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

స్పందన రద్దు

అమలాపురం రూరల్: సార్వత్రిక ఎన్నికల షెడ్యూల్ విడుదల చేసిన నేపథ్యంలో ప్రతి సోమవారం నిర్వహిస్తున్న జిల్లాస్థాయి ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక స్పందనను రద్దు చేసినట్లు కలెక్టర్ కార్యాలయం అధికారులు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 18వ తేదీ నుంచి ఎన్నికల ప్రవర్తన నియమావళి అమల్లో ఉన్నంత కాలం నిర్వహించడం జరగదని కలెక్టర్ కార్యాలయ అధికారులు ఆ ప్రకటనలో పేర్కొన్నారు. అదే విధంగా డివిజన్, మండల, మున్సిపల్, గ్రామ, సచివాలయ స్థాయిలలో ప్రజల నుంచి అర్జీలను స్వీకరించే స్పందన కార్యక్రమాలు ఎన్నికల దృష్ట్యా నిర్వహించడం లేదని కలెక్టరేట్ ఉన్నతాధికారులు తెలిపారు.

జిల్లాలో 15.18 లక్షల ఓటర్లు

- పెరిగిన ఓటర్లు 7,702 మంది
- తాజా చేరికలతో ఇంకా పెరిగే అవకాశం

సాక్షి, అమలాపురం: సార్వత్రిక ఎన్నికల నగారా మోగడంతో జిల్లా యంత్రాంగం అందుకు తగ్గ ఏర్పాట్లలో తలమునకలైంది. ఎన్నికల షెడ్యూలు విడుదల కావడంతో అధికారులు కార్యరంగంలోకి దూకారు. నియోజకవర్గాల వారీగా పోలింగ్ కేంద్రాలు, ఓటర్ల వివరాలు వెల్లడించారు. నియోజకవర్గాల వారీగా ఎన్నికల రిటర్నింగ్ అధికారులను నియమించారు.

జిల్లాలో 15,18,195 ఓటర్లు ఉన్నారు. వీరిలో పురుషులు 7,52,909 మంది కాగా, మహిళలు 7,65,266 మంది, ఇతరులు 20 మంది. పురుషులు కన్నా మహిళలు 12,357 ఓట్లు అధికం కావడం గమనార్హం. దీంతో గతం కంటే తాజాగా పెరిగిన ఓటర్లు 7702. అప్పట్లో జిల్లాలో ఓటర్లు 15,10,493 మంది మాత్రమే. జిల్లాలో ట్రాన్స్‌జెండర్స్ ఓటర్లు సైతం పెరిగారు. జనవరి నాటికి 17 ఓట్లు ఉండగా, ఇప్పుడు 20కి చేరింది. కొత్త ఓటర్లలో యువత ఎక్కువగా పెరిగారు. ఏప్రిల్ 15 వరకు ఓట్ల నమోదుకు రాష్ట్ర ఎన్నికల కమిషన్ అనుమతి ఇచ్చినందున ఓట్లు మరింత పెరిగే అవకాశముందని అంచనా వేస్తున్నారు.

జిల్లాలో జనవరి 22 నుంచి మార్చి 15 నాటి ఓటర్ల వివరాలు ఇలా..

నియోజకవర్గం	జనవరి 22 ఓటర్లు	మార్చి 15న ఓటర్లు	పెరిగిన ఓటర్లు
రామచంద్రపురం	2,00,147	2,01,428	1,281
ముమ్మిడివరం	2,41,875	2,42,804	929
అమలాపురం	2,10,907	2,11,804	897
రాజోలు	1,95,190	1,96,201	1,011
పి.గన్నవరం	1,96,337	1,97,048	711
కొత్తపేట	2,48,392	2,50,029	1,637
మండపేట	2,17,645	2,18,881	1,236

ఎన్నికల రిటర్నింగ్ అధికారుల వివరాలు

నియోజకవర్గం	అధికారి పేరు	హోదా	సెల్ నంబరు
అమలాపురం (లోక్‌సభ)	హిమాన్షు శుక్లా	కలెక్టర్	89779 35211
రామచంద్రపురం	ఎస్.సుధాసాగర్	ఆర్డీవో	96184 15521
ముమ్మిడివరం	మదన్‌మోహన్‌రావు	స్పెషల్ డిప్యూటీ కలెక్టర్	89779 35812
అమలాపురం	జి.కేశవవర్ధన్‌రెడ్డి	ఆర్డీవో	98499 03866
రాజోలు	ఎస్.నూపుర్ అజయ్	జాయింట్ కలెక్టర్	89779 35212
పి.గన్నవరం	ఏఎస్ఆర్.మూర్తి	సీఈవో	94904 99695
కొత్తపేట	జీవీవీ సత్యనారాయణ	ఆర్డీవో	91549 83101
మండపేట	డీవీఎస్ ఎల్లారావు	డీఎం, సివిల్ సప్లయిస్	77992 19259

కన్నుల పండువగా శిఖర కళాప్రకర్షణ



శిఖర కళాప్రకర్షణ కార్యక్రమం నిర్వహిస్తున్న పండితులు

ఆత్రేయపురం: వాడపల్లి శ్రీదేవి, భూదేవి సమేత వేంకటేశ్వరస్వామి స్వర్ణ శిఖర కళాప్రకర్షణ ఆదివారం కన్నుల పండువగా జరిగింది. ఉదయం స్వామి వారికి విష్వక్సేన పూజ, పుణ్యాహవచనం, సప్త కలశారాధన తదితర పూజలు ఘనంగా నిర్వహించారు. ఆలయ క్షేత్రపాలకుడు కాశీ అన్నపూర్ణ సమేత విశ్వేశ్వరస్వామి, వేణుగోపాల స్వామి, మహాలక్ష్మి అమ్మవార్లకు స్వర్ణ కలశ ప్రతిష్ఠ నిర్వహించారు. ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ చిర్ల జగ్గిరెడ్డి సహకారంతో ఆలయ కమిటీ చైర్మన్ రుద్రరాజు రమేష్‌రాజు ఆధ్వర్యంలో కార్యక్రమం జరిగింది. దాతలు తాడి మోహన్‌రెడ్డి, మేడపాటి సిద్ధార్థ రెడ్డి, చిర్ల వాసిరెడ్డి, పెన్మెత్స సురేష్ రాజు తదితరులు సమర్పించిన రూ.35 లక్షలతో ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఏర్పాట్లను ఆలయ కమిటీ చైర్మన్ రుద్రరాజు రమేష్‌రాజు, ఈఓ భూపతిరాజు కిశోర్‌కుమార్ పర్యవేక్షించారు.

రగులుతున్న ఆశావహులు

- రామచంద్రపురంలో ఉమ్మడి అభ్యర్థికి తెరచాటు సెగ
- రెండు మూడు రోజుల్లో కార్యాచరణ!
- రెబల్‌గా రంగంలోకి దిగాలని యోచన

రామచంద్రపురం: ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లాలోనే రాజకీయ సంచలనాలకు రామచంద్రపురం నియోజకవర్గం వేదికగా ఉంటుంది. ఇక్కడ టీడీపీ, జనసేన, బీజేపీ ఉమ్మడి అభ్యర్థిగా టీడీపీ నుంచి అమలాపురానికి చెందిన వాసంశెట్టి సుభాష్ పేరును ఇటీవల ప్రకటించారు. ఆయన అభ్యర్థిత్వాన్ని అటు వ్యతిరేకించలేక, ఇటు ఆమోదించలేక.. మూడు పార్టీల్లోని ఆశావహులు కక్కలేక... మింగలేక అన్న చందాన రగిలిపోతున్నారు. దీనికి తోడు సుభాష్.. ఇక్కడి నాయకులను ఏమాత్రం ఖాతరు చేయకుండా, రెండు పార్టీల సమావేశం నిర్వహించకుండా.. తనకు నచ్చిన వారితో వెళ్తూ, ఒంటెద్దు పోకడ అనుసరిస్తున్నారంటూ వారు మండిపడుతున్నారు. ఈ నేపథ్యంలో సుభాష్‌కు రెబల్ రూపంలో సెగ పెట్టేందుకు తెరచాటున ముమ్మరంగా ప్రయత్నాలు సాగిస్తున్నారు. ఆవిర్భావం నుంచీ పార్టీ కోసం పని చేసిన వారికి కాకుండా.. ఆర్థిక బలమే ప్రాతిపదికగా అప్పటికప్పుడు తీసుకువచ్చిన సుభాష్‌కు టికెట్టు ఇవ్వడమేమిటని ఆశావహులు లోలోపల రగిలిపోతున్నారు. ఈ నేపథ్యంలో రెండు రోజులుగా నియోజకవర్గ జనసేన, టీడీపీల్లో తెరచాటుగా జరుగుతున్న రాజకీయ పరిణామాలు ఆసక్తికరంగా మారాయి. ఈ రెండు పార్టీల్లో టికెట్టు ఆశించి భంగపడిన నేతలందరూ ఒక్కటవుతున్నారు. సుభాష్‌కు మద్దతు ఇవ్వాలా లేక అసమ్మతి జెండా ఎగురవేయాలా అనే అంశంపై రహస్య సమావేశాలు నిర్వహిస్తున్నారు.

చాపచుట్టేసిన సుబ్రహ్మణ్యం

శాసన మండలి మాజీ డిప్యూటీ చైర్మన్ రెడ్డి సుబ్రహ్మణ్యం గత మూడేళ్లుగా నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జిగా వ్యవహరించారు. చివరకు అధిష్టానం మొండిచేయి చూపడంతో చాప చుట్టేసి స్వస్థలం కొత్తపేట వెళ్లిపోయారు. దీంతో పట్టణంలోని హౌసింగ్ బోర్డు కాలనీలోని టీడీపీ కార్యాలయం ఇప్పుడు వెలవెలబోతోంది. సుభాష్ పేరు ప్రకటించినప్పటి నుంచీ సుబ్రహ్మణ్యం నియోజకవర్గంలో కనిపించటం లేదు.

కాకినాడలో రహస్య సమావేశం

సీనియర్ నేతలను కాదని, పార్టీకి సంబంధం లేని వారితో సుభాష్ ముందుకు సాగుతున్న తీరును వారు విమర్శిస్తున్నారు. దీనిపై అమీతుమీ తేల్చుకునేందుకు రెండు రోజుల క్రితం కాకినాడలోని ఒక హోటల్‌లో టీడీపీ, జనసేనలకు చెందిన ఆశావహులతో పాటు నియోజకవర్గానికి చెందిన ఆయా పార్టీల సానుభూతిపరులు, ఒక సామాజికవర్గానికి చెందిన బడా నేతలు రహస్య సుదీర్ఘ సమావేశం నిర్వహించినట్లు తెలిసింది. ఈ సందర్భంగా రెబల్ అభ్యర్థిగా ఇండిపెండెంట్‌గా నామినేషన్ వేసి రంగంలోకి దిగాలనే నిర్ణయానికి వచ్చినట్లు సమాచారం. అయితే, ఎవరి మెడలో గంట కట్టాలనే విషయమై ఒక నిర్ణయానికి రాలేకపోయారని తెలుస్తోంది. నియోజకవర్గానికి చెందిన ఆర్థికంగా బలంగా ఉన్న ఒక కాపు సామాజికవర్గ నేత ఒకరు రెబల్‌గా రంగంలోకి దిగేందుకు సంసిద్ధత వ్యక్తం చేశారని అంటున్నారు. దీనిపై రెండు మూడు రోజుల్లో ఒక నిర్ణయానికి రావాలని వారు తీర్మానించుకున్నట్లు సమాచారం. ఈ అంశంపై వారు కె.గంగవరం మండలం కోటిపల్లిలో సోమవారం రెండోసారి సమావేశం కానున్నట్లు తెలిసింది.

నియోజకవర్గంలో ఇప్పటి వరకూ పార్టీ కోసం పని చేసిన వారిని కాదని బయటి నుంచి సుభాష్‌ను తీసుకురావడాన్ని ఇటు టీడీపీ, అటు జనసేన నేతలు తీవ్రంగా వ్యతిరేకిస్తున్నారు. ఇదే విషయాన్ని ఆయా అధిష్టానాలనకు చెప్పినా పట్టించుకోలేదని వాపోతున్నారు. దీంతో రెబల్‌గా పోటీ చేసి, సత్తా చాటాలని వారు ఒక నిర్ణయానికి వచ్చినట్లు చెబుతున్నారు. దీనిపై రెండు మూడు రోజుల్లో కార్యాచరణ ప్రకటించేందుకు సిద్ధమవుతున్నట్లు సమాచారం. తద్వారా ఉమ్మడి టీడీపీ అభ్యర్థి సుభాష్‌కు పొగ పెట్టేందుకు రంగం సిద్ధం చేస్తున్నారు.



బోసిపోయిన టీడీపీ కార్యాలయం



ముచ్చుమిల్లి రోడ్డులో వెలవెలబోతున్న జనసేన కార్యాలయం

కంగుతిన్న జనసేన నేతలు

అలాగే, ఆవిర్భావం నుంచీ నియోజకవర్గంలో జనసేనకు పోలిశెట్టి చంద్రశేఖర్ పెద్ద దిక్కుగా ఉంటున్నారు. 2019 ఎన్నికల్లో ఓడిపోయిన తరువాత కూడా నేటి వరకూ ఆ పార్టీ ఇన్‌చార్జిగా ఉంటూ వచ్చారు. అటువంటి తనకు కూడా ఆ పార్టీ మొండిచేయి చూపించటంతో ఏం చేయాలో పాలుపోలేని స్థితిలో ఉన్నారు.

ఈయనతో పాటు నియోజకవర్గంలో జనసేన పార్టీ కోసం పని చేసిన చిక్కాల దొరబాబు కూడా టికెట్టు ఆశించి భంగపడ్డారు. జనసేన పార్టీ ఆవిర్భావం రోజునే ఉమ్మడి అభ్యర్థిగా సుభాష్‌ను ప్రకటించటంతో జనసేన నేతలు కంగు తిన్నారు. అప్పటి నుంచీ ఆ పార్టీ కార్యక్రమాలకు దూరంగా ఉంటున్నారు. ఆ పార్టీ కార్యాలయం కూడా వెలవెలబోతోంది. వీరితో పాటు టీడీపీ నుంచి టికెట్టు ఆశించిన రేవు శ్రీను, కాదా వెంకట రమణ, రాయపురెడ్డి రాజా కూడా అంతర్ధానంలోకి వెళ్లిపోయారు.

క్లుప్తంగా

అన్నాచెల్లెళ్లకు సచివాలయ ఉద్యోగాలు


ముడకల వినోద్ రెడ్డి


ముడకల సత్యశ్రీ

ఉప్పలగుప్తం: మండలంలోని గొల్లవిల్లి గ్రామానికి చెందిన ముడకల వినోద్ రెడ్డి, ముడకల సత్యశ్రీ అనే అన్నాచెల్లెళ్లు ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డి ప్రవేశపెట్టిన గ్రామ సచివాలయాల్లో ఉద్యోగులుగా నియమితులయ్యారు. గ్రామానికి చెందిన ముడకల వరప్రసాద్, రామానుజలమ్మ దంపతులది సామన్య కుటుంబం. వారి పిల్లలను ఎంతో కష్టపడి చదివించారు. చదువుల అనంతరం ఇటీవల విడుదలైన సచివాలయ నోటిఫికేషన్‌లో మంచి ఫలితాలు సాధించి వినోద్ రెడ్డి అనంతపురం జిల్లాలో, సత్యశ్రీ గుంటూరు జిల్లాలో ఉన్న గ్రామ సచివాలయాల్లో పశువైద్య సహాయకులుగా నియమితులయ్యారు. ఈ సందర్భంగా గ్రామస్తులు వారి కుటుంబానికి అభినందనలు తెలిపారు.

'నాకు అన్యాయం జరిగింది'

టీడీపీ జిల్లా కార్యదర్శి పెంకే శ్రీనివాస బాబా


రమణయ్యపేట శెట్టిబలిజ రామాలయం వద్ద సమావేశంలో మాట్లాడుతున్న శ్రీనివాస బాబా

కాకినాడ రూరల్: కష్టపడి పని చేసినా బీసీ నాయకుడిగా ఉన్న తనకు టీడీపీ అన్యాయం చేసిందని ఆ పార్టీ జిల్లా కార్యదర్శి పెంకే శ్రీనివాస బాబా ఆవేదన వ్యక్తం చేశారు. జనసేన, టీడీపీ పొత్తులో భాగంగా కాకినాడ రూరల్ టిక్కెట్‌ను జనసేనకు కేటాయించి, బీసీలకు ఇవ్వలేదని చెప్పారు. అలాగే పార్టీ జిల్లా కార్యదర్శిగా కష్టపడి పనిచేసిన తనకు సముచిత స్థానం లభించలేదన్నారు. ఇటీవల కో–ఆర్డినేటరు, కో–ఆర్డినేటరు పదవుల కేటాయింపులో పార్టీ పెద్దలు ఏకపక్షంగా వ్యవహరించారన్నారు. ఆత్మీయ సమావేశాల పేరిట తనకు జరిగిన అన్యాయాన్ని గ్రామాల్లో వివరిస్తున్న శ్రీనివాస బాబా ఆదివారం సాయంత్రం కాకినాడ ఒకటో డివిజన్ రమణయ్యపేట శెట్టిబలిజ రామాలయం వద్ద సమావేశం ఏర్పాటు చేశారు. ఇండిపెండెంట్‌గా పోటీ చేయాలని పలువురు ఆయనను కోరడంతో, టీడీపీలో జరిగిన అన్యాయంపై పార్టీ అధిష్టానం నుంచి న్యాయం జరగకపోతే, కార్యకర్తలు, అభిమానుల సూచనల మేరకు ముందుకు వెళతానన్నారు.

మార్గదర్శకాలు పదిలం

- విద్యార్థులకు.. అధికారులకూ పరీక్షే!
- ఇవీ.. నిబంధనలు, సూచనలు, సలహాలు


మండపేట పరీక్షా కేంద్రంలో ఇన్విజిలేటర్లకు సూచనలిస్తున్న సీఎస్

రాయవరం: పదో తరగతి పరీక్షలు సోమవారం నుంచి ప్రారంభం కానున్నాయి. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లాలో 113 పరీక్షా కేంద్రాల్లో 21,113 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరవుతున్నారు. పరీక్షలను పక్కాగా నిర్వహించేందుకు జిల్లా విద్యాశాఖ అన్ని చర్యలు చేపట్టింది. శనివారం మధ్యాహ్నం అన్ని పరీక్షా కేంద్రాల్లో ఇన్విజిలేటర్లకు సమావేశాలు నిర్వహించి సూచనలు, సలహాలు అందజేశారు. పదో తరగతి పరీక్షలు ప్రారంభమవుతున్న నేపథ్యంలో చీఫ్, డీవోలతో పాటు ఇన్విజిలేటర్లు చేయాల్సిన విధులపై 'సాక్షి' కథనం.

సీఎస్, డీవోలు చేయాల్సినవి

- పరీక్షా కేంద్రాన్ని ముందుగా సందర్శించి ఫర్నీచర్, తాగునీరు, విద్యుత్ సౌకర్యాలు, పరిశుభ్రత పరిశీలించాలి.
- తహసీల్దారు, ఎస్‌పీహెచ్‌వోలకు పరీక్షల విషయం తెలియజెప్పాలి. వారి ఫోన్ నంబర్లు తీసుకోవాలి.
- పరీక్షల నిర్వహణకు అన్ని ఫారాలు సిద్ధం చేసుకోవాలి. డి–ఫామ్, ఓఎంఆర్ షీట్లు, పేపర్ సీల్, అటెండెన్స్ షీట్లు సరిపడా అందాయో లేదో చూసుకోవాలి.
- ట్రంకు పెట్టెలు, క్లాత్ బ్యాగ్స్ వంటి కంటింజెన్స్ సామగ్రి సిద్ధం చేసుకోవాలి.
- సిబ్బంది నుంచి వారికి సంబంధించిన కుటుంబ సభ్యులు ఎవరూ పరీక్ష రాయడం లేదని నో రిలేషన్స్ సర్టిఫికెట్లు తీసుకోవాలి. ఒకవేళ ఎవరైనా పరీక్ష రాస్తున్నట్టయితే సదరు ఇన్విజిలేటర్‌ను వేరే ప్రాంతానికి నియమించే అవకాశం ఏర్పడుతుంది.
- సిబ్బందికి గుర్తింపు కార్డులు ఇవ్వాలి.
- బాలికలను చెక్ చేయడానికి మహిళా సిబ్బందిని ఏర్పాటు చేసుకోవాలి.

ప్రతి రోజు వైర్‌లెస్‌సెట్ కాన్ఫరెన్స్‌కు

- ప్రతి రోజు ఉదయం 7.45 గంటలకు వైర్‌లెస్ సెట్ కాన్ఫరెన్స్‌కు హాజరుకావాలి.
- నిర్దేశించిన సమయాని కన్నా ముందు సీఎస్, డీవో ఇద్దరు సంతకాలతో పరీక్షల కట్టల సీల్ తెరవాలి.
- లాటరీ పద్ధతిలోనే ఇన్విజిలేటర్లకు తరగతి గదులు కేటాయించాలి.

ఇన్విజిలేటర్లకు సూచనలివీ

- ఇన్విజిలేటర్లు ఫొటో గుర్తింపు కార్డు తీసుకోవాలి. రోజూ తప్పకుండా ఐడీ కార్డు ధరించాలి.
- పరీక్ష పేపర్ల కోడ్‌లు, సరైన కాంబినేషన్ గురించి విధిగా తెలుసుకోవాలి.
- పరీక్ష రోజు ఉదయం 8.30 గంటలకు కేంద్రం వద్దకు హాజరు కావాలి. 8.45 గంటలకు విద్యార్థులను పరీక్ష గదిలోకి అనుమతించాలి. 9.30 గంటల తర్వాత విద్యార్థులను పరీక్షకు అనుమతించరాదు.
- ప్రతి విద్యార్థిని సోదా చేసి, ఎటువంటి ఫర్‌బిడెన్ మెటీరియల్ లేదని నిర్ధారించుకోవాలి. విద్యార్థినులను మహిళా ఇన్విజిలేటర్లు మాత్రమే సోదా చేయాలి.
- విద్యార్థులకు ఫొటో, అన్ని వివరాలతో కూడిన హాల్‌టికెట్ అందిస్తారు. విద్యార్థిని హాల్ టికెట్, అటెండెన్స్ షీట్‌లోని ఫొటోతో పోల్చి నిర్ధారించుకోవాలి. అభ్యర్థిపై అనుమానం ఉంటే వెంటనే సీఎస్ దృష్టికి తీసుకుని వెళ్లాలి.
- అన్ని పరీక్షలు బార్ కోడింగ్ విధానంలో జరుగుతాయి. ఉదయం 8.45 గంటలకు ఓఎంఆర్ ప్రధాన/అదనపు సమాధాన పత్రాలు సీఎస్ నుంచి పొందాలి.
- ప్రధాన సమాధాన పత్రంలోని సూచనలను, ఓఎంఆర్ షీట్ వెనుక భాగంలో సూచనలు విద్యార్థులకు వివరించాలి.
- ఓఎంఆర్ షీట్ మినహా ఏ పేపర్ పైనా కూడా హాల్ టికెట్ నంబరు, పేరు రాయించరాదు.
- ఓఎంఆర్ షీటు ఏదైనా కారణంతో పాడైతే, వెంటనే సీఎస్ దృష్టికి తీసుకు వెళ్లి, నాన్ స్టాండర్డ్ ఓఎంఆర్ షీట్ పొందాలి.
- ఓఎంఆర్ షీట్‌పై ఉన్న బార్‌కోడ్‌పై రాయడం గాని, నలపడం గాని చేయకుండా విద్యార్థులను హెచ్చరించాలి.
- 9.25 గంటల లోపు ఇన్విజిలేటర్ అన్ని పనులు ముగించుకుని 9.30 గంటలకు కచ్చితంగా ప్రశ్నపత్రాలు ఇవ్వాలి.
- ప్రశ్న పత్రాలు తీసుకున్న వెంటనే సరిపడినన్ని ఉన్నాయా? ఆ రోజుకు సంబంధించిన సబ్జెక్టు/పేపర్‌కోడ్/ మీడియం సరిచూసుకోవాలి. పేపరు ఏ మాత్రం తప్పుగా ఇచ్చినా సంబంధిత ఇన్విజిలేటర్‌పై తీవ్రమైన క్రమ శిక్షణ చర్యలు తీసుకుంటారు.
- గైర్హాజరైన విద్యార్థుల ఓఎంఆర్ షీట్‌ను ఎర్ర సిరా పెన్‌తో క్యాన్సిల్ చేయాలి.
- సమాధాన పత్రాలు, ఆన్సర్ బుక్‌లెట్ అన్నీ సరిచూసుకున్నాకే విద్యార్థులను బయటకు పంపించాలి.

పిల్లలపై ఒత్తిడి తేవద్దు

- తల్లిదండ్రులు / సంరక్షకులు పరీక్ష ప్రారంభానికి ఒక రోజు ముందు పరీక్షా కేంద్రాన్ని సందర్శిస్తే పరీక్ష ప్రారంభం రోజున పరీక్ష కేంద్రాన్ని సులువుగా చేరుకోవచ్చు. 'అభ్యర్థుల్లో ఆందోళన, భయాన్ని కలిగించే వదంతులు నమ్మరాదు.
- రాత్రి పూట ఎక్కువ సమయం చదవమని పిల్లపై ఒత్తిడి చేయరాదు.
- ఆందోళన, ఉద్రిక్తత నివారించడానికి విద్యార్థులు పరీక్షా కేంద్రానికి ఉదయం 8.45 గంటలకు లేదా ముందుగానే పరీక్షా కేంద్రానికి చేరుకుంటే మంచిది.
- పరీక్షా కేంద్రానికి అవసరమైన పెన్నులు, పెన్సిళ్లు, ఎరేజర్లు, స్కేలు తదితర స్టేషనరీ తప్పకుండా తీసుకుని వెళ్లేలా చూసుకోవాలి.
- పరీక్షా కేంద్రంలో ఇతర అభ్యర్థులతో మాట్లాడవద్దని, ఇతర దుష్ప్రవర్తనలకు పాల్పడవద్దని వారి పిల్లలను హెచ్చరిస్తే మంచిది.

విద్యార్థులకు సూచనలివీ

- విద్యార్థులు విధిగా హాల్ టికెట్‌ను తమ వెంట తీసుకువెళ్లాలి. హాల్ టికెట్ తీసుకుని వెళ్లని వారిని పరీక్షకు అనుమతించరు.
- పరీక్షా కేంద్రంలోకి ప్రవేశించే అభ్యర్థులు పరీక్షకు సంబంధించి పుస్తకాలు, పేపర్లు వెంట తీసుకుని వెళ్లరాదు. పరీక్ష రాసే అభ్యర్థులు పుస్తకాలు, పేపర్లు కలిగి ఉంటే నిబంధనల ప్రకారం చర్యలు తీసుకుంటారు.
- పరీక్షా కేంద్రంలోకి మొబైల్ ఫోన్లు, ల్యాప్‌టాప్‌లు, ఇయర్‌ఫోన్స్, స్మార్ట్ వాచ్‌లు, బ్లూటూత్ పరికరాలు ఇతర ఎల్రక్టానిక్ పరికాలను తీసుకెళ్లరాదు.
- అభ్యర్థులు 24 పేజీల సమాధానాల బుక్‌లెట్‌ను పూర్తి స్థాయిలో ఉపయోగించుకోవాలి. 'ప్రశ్న పద పరిమితిని కచ్చితంగా పాటించాలి.
- సమాధానాల నాణ్యత ఆధారంగా మార్కులు ఇస్తారు.
- సైన్స్ పరీక్షలో ఫిజికల్ సైన్స్, నేచురల్ సైన్స్ ప్రశ్నలకు సమాధానాలు రాయడానికి విడివిడిగా ఓఎంఆర్‌లు ఉన్న రెండు 12 పేజీల సమాధానాల బుక్‌లెట్లు ఒకేసారి అందజేస్తారు.
- విద్యార్థులు రెండు సబ్జెక్టులకు సమాధానాలు రాసేటప్పుడు జాగ్రత్తలు తీసుకోవాలి. 'పరీక్షల సమయంలో ఎటువంటి అవకతవకలకు పాల్పడినా తదుపరి పరీక్షలకు అనుమతించరు.
- ముందు రాసిన పరీక్షల ఫలితాలు వెల్లడించరు.
- అభ్యర్థి పేరు, రోల్ నంబరు లేదా అభ్యర్థి ఇతర వివరాలను 24 పేజీల బుక్‌లెట్, మ్యాప్, గ్రాఫ్ షీట్‌లో ఏ పేజీలోనూ రాయకూడదు.

విజేతలు పైడితల్లి, అమ్మతల్లి

- రాష్ట్రస్థాయి జోడెడ్ల బళ్ల పోటీల్లో అనకాపల్లి ఎడ్లకు ప్రథమస్థానం
- విజేతలకు ఎంపీ గీత బహుమతి ప్రదానం


విజేతకు బహుమతి అందజేస్తున్న కాకినాడ ఎంపీ గీత

పిఠాపురం: మండలం బి.ప్రత్తిపాడులో ఆదివారం రాష్ట్ర స్థాయి ఎడ్ల పరుగు పందాలు ఉత్కంఠగా సాగాయి. సీనియర్, జూనియర్ విభాగాల్లో 40 జతల ఎడ్లు పాల్గొన్నాయి. సీనియర్స్ విభాగంలో మొదటి బహుమతి అనకాపల్లి జిల్లా లెంకెలపాలేనికి చెందిన పైడితల్లి అమ్మతల్లి, రెండో బహుమతి మండపేటకు చెందిన వేగుళ్ల తేజ, మూడో బహుమతిగా మండపేట మండలం గుమ్మలూరుకు చెందిన కోరా వీరవెంకట సత్యవాణిలకు చెందిన ఎడ్ల జతలు గెలుచుకున్నాయి. జూనియర్స్ విభాగంలో మొదటి బహుమతిని మండపేట మండలం గుమ్మలూరుకు చెందిన కోరా వీర వెంకట సత్యవాణి, రెండో బహుమతిగా యర్రపాలేనికి చెందిన ఇజ్జన శ్రీను, మూడో బహుమతిగా కొప్పవరానికి చెందిన బండారు శ్రీనులకు చెందిన ఎడ్ల జతలు గెలుచుకున్నాయి. విజేతలకు కాకినాడ ఎంపీ, పిఠాపురం వైఎస్సార్‌సీపీ అసెంబ్లీ అభ్యర్థి వంగా గీత బహుమతులు అందజేసారు.

గోదావరిలో మునిగి వ్యక్తి మృతి

కంబాలచెరువు: స్థానిక పుష్కరాలరేవులో పూజా సామగ్రి కలుపుతూ ప్రమాదవశాత్తూ గోదావరి నదిలో పడి నిమ్మకాయల నవీన్‌సాగర్ (38) ఆదివారం మృతిచెందాడు. రెల్లిపేటకు చెందిన నవీన్ మున్సిపల్ కార్పొరేషన్‌లో తడి, పొడి చెత్త సేకరణ విభాగంలో పనిచేస్తుంటాడు. ఫిట్స్ వ్యాధి ఉన్న అతడు సాయంత్రం ఐదు గంటల సమయంలో పూజా సామగ్రి కలిపేందుకు గోదావరి నదికి వచ్చాడు. మోకాళ్ల లోతు వరకు దిగి పూజా సామగ్రిని కలుపుతుండగా ఫిట్స్ వచ్చి నదిలో పడిపోయాడు. దీన్ని చూసిన స్థానికులు వెంటనే అతనిని బయటకు లాగారు. బయటకు తెచ్చి చూసేసరికే సాగర్ మృతి చెందాడు. మృతుని అన్న మనోజ్ ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

రాష్ట్ర స్థాయి 'యోగా'కు వాడపాలెం విద్యార్థులు


రాష్ట్రస్థాయి యోగా పోటీలకు ఎంపికైన విద్యార్థులతో యోగా శిక్షకుడు శ్రీనివాస్

కొత్తపేట: అనకాపల్లిలో ఈ నెల 25 న జరిగే రాష్ట్ర స్థాయి యోగా పోటీలకు కొత్తపేట మండలం వాడపాలెం విద్యార్థులు 9 మంది ఎంపికైనట్టు స్థానిక వివేకానంద యోగా ఆశ్రమం నిర్వాహకుడు ఆకుల శ్రీనివాస్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇటీవల అమలాపురం కామాక్షి పీఠంలో జరిగిన యోగా పోటీల్లో వాడపాలెం పాఠశాల విద్యార్థులు బి.మేఘన, వి.సారిక, వి.శ్రావణి, జి.నందిని, ఎస్.మోక్ష, జి.నిఖిల, ఎం.హేమదీక్షిత, జి.అఖిల, ఎం .అనిష్కవిద్య అత్యుత్తమ ప్రతిభను కనబరచి రాష్ట్ర పోటీలకు ఎంపికయ్యారని శ్రీనివాస్ పేర్కొన్నారు.

అందివచ్చారన్నంతలో అనంత లోకాలకు..

- ఇద్దరు యువకులను మింగేసిన బొలెరో
- ఒకే గ్రామానికి చెందిన ఇద్దరి మృతితో ఇరు కుటుంబాల్లో మిన్నంటిన ఆక్రందనలు
- రమణయ్యపేటలో విషాదఛాయలు


ముత్త హరిసాయి వెంకట అప్పారావు (ఫైల్)


పాలిమేరు వెంకటేశ్ (ఫైల్)



ప్రమాదానికి కారణమైన బొలెరో వ్యాన్

కిర్లంపూడి: అప్పటి వరకూ కుటుంబ సభ్యులతో సరదాగా గడిపిన ఆ ఇద్దరు యువకులు మరణించారనే కబురు ఇరు కుటుంబాల్లో విషాదం నింపింది. చేతికందొచ్చిన కొడుకులు ఇక లేరు అనే నిజాన్ని జీర్ణించుకోలేక ఆ కుటుంబాల్లో ఆక్రందనలు మిన్నంటాయి. కిర్లంపూడి ఎస్సై షేక్ జబీర్ తెలిపిన వివరాల మేరకు ఆదివారం మధ్యాహ్నం కిర్లంపూడి మండలం రమణయ్యపేటకు చెందిన ముత్త పెదకాపు కుమారుడు ముత్త హరిసాయి వెంకట అప్పారావు (20), కొత్తపేటకు చెందిన పాలిమేరు అప్పారావు కుమారుడు పాలిమేరు వెంకటేశ్ (20) ఇద్దరు కలిసి మోటార్ సైకిల్‌పై దివిలి నుంచి కిర్లంపూడి వస్తున్నారు. కాకినాడకు చెందిన ఓ బొలెరో వ్యాన్ కిర్లంపూడిలోని జగపతినగరంలో ఒక టైల్ షాపులో టైల్స్‌ను అన్‌లోడ్ చేసి తిరిగి వస్తూ కిర్లంపూడి–రాజుపాలెం మధ్యలో ఎదురుగా ఉన్న ఆటోను ఓవర్‌టేక్ చేసే సమయంలో ఎదురుగా వస్తున్న ఇద్దరి యువకులను బలంగా ఢీకొంది. దీంతో హరిసాయి వెంకట అప్పారావు తలకు బలమైన గాయమై అక్కడికక్కడే మరణించాడు. కొన ఊపిరితో ఉన్న వెంకటేశ్‌ను అంబులెన్స్‌లో కాకినాడ జీజీహెచ్‌కు తరలిస్తుండగా మార్గం మధ్యలో మృతి చెందాడు. మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం ప్రత్తిపాడు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ప్రమాదానికి కారణమైన డ్రైవర్‌ను, బొలెరో వ్యాన్‌ను అదుపులోకి తీసుకున్నారు. మృతుడు వెంకటేశ్ మేనమామ బొడ్డేటి రమేష్ ఇచ్చిన ఫిర్యాదుతో కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై జబీర్ తెలిపారు.

తమను పోషించే కొడుకు ఇక లేడని తల్లి రోదన

తరగతి గదిలో కూర్చుని తోటి స్నేహితులతో పాఠాలు చదవాల్సిన వెంకటేశ్‌ను విధి ఎప్పుడూ చిన్నచూపే చూసింది. వెంకటేశ్‌కు తల్లి, అన్నయ్య, అక్క ఉన్నారు. తండ్రి అనారోగ్యంతో మరణించాడు. తల్లి అనారోగ్యంతో ఇంటికే పరిమితమైంది. దీంతో సోదరుడు ఉన్నా కుటుంబ భారం వెంకటేశ్‌పైనే పడింది. తనకు తెలిసిన ఓ సోదరుడి మీ–సేవా సెంటర్‌లో పనిచేస్తూ తన కుటుంబాన్ని పోషిస్తున్నాడు. తన సోదరికి పెళ్లి చేసి ఆమె మంచిచెడ్డలు తానే చూసుకునేవాడు. ఇంత చిన్న వయసులో కుటుంబ భారాన్ని తన భుజాలపై వేసుకున్న వెంకటేశ్‌ను చూసి అందరు జాలి పడేవారు. మీ–సేవా సెంటర్‌కు వెళ్లిన ప్రతి ఒక్కరిని అన్నయ్య, తమ్ముడు, అక్క అనే పిలిచే వెంకటేశ్ మరణ వార్త అందరినీ కలచివేసింది.

ఉన్నత చదువులు చదివించాలనే కోరిక ఆవిరైపోయింది

తన ఇద్దరు కుమారులను బాగా చదివించి మంచి ఉద్యోగాల్లో చూడాలనుకున్న ముత్త పెదకాపు దంపతుల కోరిక ఆవిరైపోయింది. పెద్దకొడుకు హైదాబాద్ ఓ ప్రైవేట్ కంపెనీలో జాబ్ చేస్తున్నాడు. కాగా హరిసాయి వెంకట అప్పారావు మరణించాడనే కబురుతో తల్లిదండ్రులు బోరున రోదించారు.

కారు ఢీకొని మరొకరు..

నలుగురికి గాయాలు


మృతుడు నవీన్ (ఫైల్)

ప్రత్తిపాడు రూరల్: జాతీయ రహదారిపై ఆదివారం ప్రత్తిపాడు వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒకరు మృతి చెందగా నలుగురు గాయపడ్డారు. స్థానిక ఫారెస్టు చెక్‌పోస్టు సమీపంలోని తిరుమల లాడ్జి వద్ద ప్రత్తిపాడు వైపు వెళ్తున్న రెండు బైక్‌లను విశాఖపట్నం నుంచి విజయవాడ వైపు వెళ్తున్న కారు వెనుక నుంచి బలంగా ఢీకొంది. ఒక బైక్‌పై ఉత్తరకంచికి చెందిన తాడి గంగాధర్ (నవీన్) (29), తాడి రాజేష్, గుడాల సురేష్, మరో బైక్‌పై గొల్లప్రోలు మండలం వెల్దుర్తికి చెందిన అన్నదమ్ములు ములికి సత్యనారాయణ, ములికి ఉమా శంకర్ ప్రయాణిస్తున్నారు. వీరు ప్రయాణిస్తున్న రెండు వాహనాలను కారు వెనుక నుంచి ఢీకొంది. ఈ ప్రమాదంలో ఉత్తరకంచికి చెందిన తాడి గంగాధర్ (29) మృతి చెందాడు. మిగిలిన నలుగురు గాయాల పాలయ్యారు. వారిలో ఉత్తరకంచికి చెందిన తాడి రాజేష్, గుడాల సురేష్ తీవ్రంగా గాయపడ్డారు. వీరికి ప్రథమ చికిత్స అనంతరం మెరుగైన వైద్యం నిమిత్తం కాకినాడ జీజీహెచ్‌కు తరలించామని, వెల్దుర్తికి చెందిన ఇద్దరు ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారని సీహెచ్‌సీ ఆర్‌ఎంఓ కన్యాకుమారి తెలిపారు. ప్రత్తిపాడు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

లోవలో భక్తుల రద్దీ


తలుపులమ్మ అమ్మవారు

తుని రూరల్: కోరిన కోర్కెలు తీర్చే తలుపులమ్మ అమ్మవారిని దర్శించేందుకు వచ్చిన భక్తులతో లోవ దేవస్థానంలో ఆదివారం రద్దీ నెలకొంది. వివిధ జిల్లాల నుంచి ప్రత్యేక వాహనాల్లో తరలివచ్చిన 10 వేల మంది భక్తులు అమ్మవారిని దర్శించుకున్నారని కార్యనిర్వహణాధికారి పెన్మెత్స విశ్వనాథరాజు తెలిపారు. లడ్డూ, పులిహోర ప్రసాదాల విక్రయం ద్వారా రూ.1,33,890, పూజా టికెట్లకు రూ.94,300, కేశఖండన శాలకు రూ.18,800, వాహన పూజలకు రూ.4,500, కాటేజీలు, పొంగలి షెడ్లు, వసతి గదుల అద్దెల రూపేణా రూ.47,696, విరాళాలుగా రూ.41,224 కలిపి మొత్తం రూ.3,40,410 ఆదాయం సమకూరిందని వివరించారు.

రైల్వే ట్రాక్‌పై యువకుడి మృతదేహం



కపిలేశ్వరపురం (మండపేట): మండపేట మండలం ద్వారపూడి రైల్వేస్టేషన్ దగ్గరలో 595/31–596/01 పోస్టుల మధ్య ఆదివారం మధ్యాహ్నం 35–40 మధ్య వయసు గల గుర్తు తెలియని యువకుడి మృతదేహాన్ని రైల్వే పోలీసులు గుర్తించారు. రాజమహేంద్రవరం జీఆర్‌పీ స్టేషన్ ఎస్సై మావుళ్లు కేసు నమోదు చేశారు. ఆయన తెలిపిన వివరాలు ప్రకారం మృతుడు నీలం, గులాబీ రంగుల హాఫ్ హ్యాండ్స్ షర్టు, స్పోర్ట్స్ అని రాసి ఉన్న నీలం రంగు నైట్ ట్రాక్, రూప అని పేరు రాసి ఉన్న కాఫీ రంగు లోదుస్తు ధరించి ఉన్నాడు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు తెలిపారు. మృతుని వివరాలు తెలిసినవారు జీఆర్‌పీ స్టేషన్ నంబర్ 0883 2442821, జీఆర్‌పీ ఎస్సై 94910 03239 నంబర్లకు సమాచారం ఇవ్వాలని కోరారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

రాయవరం: మండలంలోని వెంటూరు వద్ద శనివారం సాయంత్రం జరిగిన రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి చెందిన ఘటనపై రాయవరం పోలీసులు ఆదివారం కేసు నమోదు చేశారు. ఈ కేసుకు సంబంధించి ఎస్సై జి.నరేష్ తెలిపిన వివరాలు ప్రకారం మండలంలోని పురకాలపల్లికి చెందిన మేడిశెట్టి శ్రీను (42) వెంటూరు గ్రామం వస్తుండగా ఎదురుగా వస్తున్న తొట్టి ఆటో ఢీ కొట్టింది. ప్రమాదంలో గాయపడ్డ శ్రీనును రామచంద్రపురం ఏరియా ఆసుపత్రికి తరలించగా అక్కడ నుంచి మెరుగైన చికిత్స నిమిత్తం కాకినాడ ప్రభుత్వ సామాన్య ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ అతడు శనివారం రాత్రి మృతి చెందాడు. ఆస్పత్రి నుంచి వచ్చిన సమాచారంపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై నరేష్ తెలిపారు.

202 కిలోల గంజాయి పట్టివేత

- కారు సీజ్.. ఇద్దరి అరెస్టు


స్వాధీనం చేసుకున్న గంజాయి, కారు, నిందితులతో పోలీసులు

రావులపాలెం: జాతీయ రహదారిపై అక్రమంగా తరలిస్తున్న గంజాయిని ఆదివారం సాయంత్రం రావులపాలెం పోలీసులు పట్టుకున్నారు. స్థానిక పోలీస్‌స్టేషన్‌లో జరిగిన విలేకరుల సమావేశంలో ఈ వివరాలను ట్రైనీ డీఎస్పీ విష్ణుస్వరూప్ తెలిపారు. రంపచోడవరం నుంచి చెన్నైకి గంజాయిని తరలిస్తున్నట్టు అందిన సమాచారంతో మండలంలోని ఈతకోట హైవేపై తణుకు వైపు వెళ్లే వాహనాలు తనిఖీ చేస్తుండగా మహీంద్ర వాహనంలో ఈ సరకును గుర్తించి స్వాధీనం చేసుకున్నారు. వాహనంతో పాటు అందులో ఉన్న ఒడిశా రాష్ట్రానికి చెందిన దమ కొంతేరి, చతీస్‌ఘడ్‌కు చెందిన సతీష్ విశ్వాస్‌లను అదుపులోకి తీసుకున్నారు. వారి వద్ద నుండి 202 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. సరకు విలువ రూ.10 లక్షలు, వాహనం విలువ సుమారు రూ.2.5 లక్షలు ఉంటుందన్నారు. కేసు దర్యాప్తు చేస్తున్నారు.


లాన్‌టెన్నిస్ క్రీడాభివృద్ధికి చర్యలు

- ఆంధ్రప్రదేశ్ సంఘ కార్యదర్శి రామ్‌కుమార్
- రాష్ట్రంలో అన్ని జిల్లాల్లో మౌలిక వసతుల కల్పన
- విశాఖలో అంతర్జాతీయ టోర్నీలకు చర్యలు



నాగమల్లితోట జంక్షన్ (కాకినాడ సిటీ): గ్రామీణ ప్రాంతాల్లో పాఠశాల స్థాయి నుంచి లాన్‌టెన్నిస్ క్రీడాభివృద్ధికి చర్యలు తీసుకుంటానని ఆంధ్రప్రదేశ్ లాన్ టెన్నిస్ సంఘ కార్యదర్శి పీవీ రామ్‌కుమార్ తెలిపారు. ఆదివారం కాకినాడలో ఏపీ లాన్‌టెన్నిస్ సంఘ వార్షిక సర్వసభ్య సమావేశం జరిగింది. ఈ సమావేశంలో సభ్యులు నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. మరోసారి రాష్ట్ర కార్యదర్శిగా ఏకగ్రీవంగా ఎన్నికైన కాకినాడకు చెందిన రామ్‌కుమార్ 'సాక్షి'తో మాట్లాడారు. రాష్ట్ర వ్యాప్తంగా అన్ని జిల్లాల్లో టెన్నిస్ మౌలిక వసతుల కల్పనకు నూతన కార్యవర్గం నిర్ణయించిందన్నారు. విశాఖలో 6 నుంచి 8 కోర్టులను ఏర్పాటు చేసి అంతర్జాతీయ స్థాయిలో టోర్నమెంట్ల నిర్వహణకు రాష్ట్రంలో ఆతిథ్యం ఇచ్చేలా తీర్చిదిద్దుతామన్నారు. ప్రతి ఏటాలాగే ఈ ఏడాది కూడా వేసవి ప్రత్యేక టెన్నిస్ శిక్షణ శిబిరాలు నిర్వహిస్తామని తెలిపారు. ప్రతిభ ఉండి పేద కుటుంబాలకు చెందిన క్రీడాకారులకు సంఘం తరపున టెన్నిస్ ర్యాకెట్లు, బూట్లు ఉచితంగా అందించి తక్కువ రుసుముతో శిక్షణ అందిస్తున్నామన్నారు. ప్రతి ఏటా సర్కార్ జాతీయస్థాయి టెన్నిస్ టోర్నీ కాకినాడలో నిర్వహిస్తున్నామని తెలిపారు. పాఠశాల స్థాయిలో క్రీడాకారులను ప్రోత్సహించేందుకు ఈ ఏడాది టోర్నమెంట్లు ఎక్కువ సంఖ్యలో నిర్వహించేందుకు ప్రణాళికలు సిద్ధం చేస్తున్నామన్నారు. రాష్ట్రంలోని అన్ని జిల్లాల్లో రూ.కోటి చొప్పున వ్యయవంతో ఆధునిక టెన్నిస్ కోర్టులను ప్రభుత్వ, ప్రైవేట్ భాగస్వామ్యంతో అభివృద్ధి చేసేలా చర్యలు తీసుకోనున్నట్లు తెలిపారు. 2028 వరకు నూతన కార్యవర్గం మనుగడలో ఉంటుందని రాష్ట్రంలో, జిల్లాలో టెన్నిస్ క్రీడాకారుల సంఖ్య పెంచేలా కార్యక్రమాలు చేపడతామని కుమార్ చెప్పారు.

సంఘ అధ్యక్షునిగా మహేష్‌కుమార్‌రెడ్డి


ఏపీ లాన్ టెన్నిస్ సంఘం నూతన కార్యవర్గం

నాగమల్లితోట జంక్షన్ (కాకినాడ సిటీ): ఆంధ్రప్రదేశ్ లాన్‌టెన్నిస్ సంఘం నూతన అధ్యక్షునిగా నెల్లూరుకు చెందిన ఆనం మహేష్‌కుమార్‌రెడ్డి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఏపీ లాన్ టెన్నిస్ సంఘం కార్యవర్గ సమావేశం, నూతన కార్యవర్గ ఎన్నికలు ఆదివారం కాకినాడలో జరిగాయి. ఈ ఎన్నికలకు రాష్ట్ర క్రీడా ప్రాధికార సంస్థ (శాప్) పరిశీలకునిగా కాకినాడ జిల్లా క్రీడాభివృద్ధి అధికారి బి.శ్రీనివాస్‌కుమార్, ఆలిండియా టెన్నిస్ సంఘం (ఐటా) పరిశీలకునిగా కేఆర్ రమణ, రిటర్నింగ్ అధికారిగా లాయర్ కర్రా వేణు హాజరయ్యారు. 2024–28 సంవత్సరాలకు నూతన కార్యవర్గాన్ని సభ్యులు ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. దీంతో ఎన్నిక లేకుండానే అధికారులు నూతన కార్యవర్గాన్ని ప్రకటించారు. రాష్ట్ర కార్యవర్గానికి ఉపాధ్యక్షులుగా బి.మధుసూదన్ రెడ్డి (వైఎస్సార్ కడప), గుమ్మడి వీరమోహన్ (విశాఖ), కార్యదర్శిగా పీవీ రామ్‌కుమార్ (కాకినాడ జిల్లా), కోశాధికారిగా డాక్టర్ యడ్లపల్లి రామ్‌కుమార్ (ఎన్టీఆర్ జిల్లా), సంయుక్త కార్యదర్శిగా జి.నాగరాజబాబు (బాబ్జీ) (అనంతపురం) ఎన్నికయ్యారు. కార్యవర్గ సభ్యులుగా పిల్లా బాల (తూర్పు గోదావరి), డాక్టర్ మోహన్‌రెడ్డి (ప్రకాశం), డాక్టర్ ఎన్‌సీ లక్ష్మయ్య (నంద్యాల), గంటి రవికుమార్ (అనకాపల్లి), జీవీఎస్ ప్రసాద్ (గుంటూరు) ఎన్నికయ్యారు. ఈ ఎన్నికలకు 18 జిల్లాల నుంచి కార్యవర్గ సభ్యులు హాజరయ్యారని కార్యదర్శి రామ్‌కుమార్ తెలిపారు.